క్లుప్తంగా

ప్రతిభావంతులకు నగదు పురస్కారాల ప్రదానం



గుంటూరు ఎడ్యుకేషన్: ఏఎన్‌యూ ఇటీవల విడుదల చేసిన ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల ద్వితీయ, తృతీయ సెమిస్టర్ ఫలితాల్లో హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. అమరావతి రోడ్డులోని కళాశాలలో గురువారం ఆయా కోర్సుల వారీగా ప్రతిభావంతులుగా నిలిచిన 14 మంది విద్యార్థులకు హైకోర్టు న్యాయవాది వసుమతి పూర్ణిమ తన తల్లి గడియారం ఇందిరాదేవి స్మారకార్థం నగదు ప్రోత్సాహకాల్ని అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం. రాజేశ్వరి, ఇన్‌ట్యాక్ కన్వీనర్ ఎస్వీఎస్ లక్ష్మీనారాయణ, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, సహాయాచార్యులు సీహెచ్. వైష్ణవి, ఏ. బాజీబాబు, సీహెచ్. వేదవతి, ఎన్. మణికంఠ, అభిలాష్, గోపి శ్రీనివాసరావు, అనిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పదో తరగతి దశను అధిగమిస్తే జీవితంలో ఉన్నతి



గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి విద్యార్థి దశను విజయవంతంగా అధిగమించడం ద్వారా విద్యార్థులు జీవితంలో ఉన్నతస్థానాలకు చేరుకోవచ్చని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు సూచించారు. సంగడిగుంటలోని జైన్ హైస్కూల్లో గురువారం టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లక్ష్మణరావు మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు నాలుగు దశాబ్దాలుగా నాణ్యమైన విద్యను అందించడంలో పాఠశాల గుర్తింపు సాధించిందని తెలిపారు. గతేడాది మాదిరి వచ్చే పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో అత్యధిక మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. మరో 10 రోజుల్లో పరీక్షలు ప్రారంభమవుతున్న దృష్ట్యా, సమష్టి ప్రణాళికతో ముందుకు వెళ్లడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. హైస్కూల్ డైరెక్టర్ మొహమ్మద్ మున్ను మాట్లాడుతూ తమ విద్యార్థులు పరీక్షా ఫలితాలతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాల్లో సైతం అత్యుత్తమ ప్రతిభను చాటుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల ప్రిన్సిపాల్ పి.కనకదుర్గ పాల్గొన్నారు.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకరంగా మహిళ ఫోన్‌కు మెసేజ్‌లు పెట్టడంతోపాటు ఆమె ఫొటోలు మార్ఫింగ్ చేసి వాట్సాప్‌లో పంపిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారంలో నివసించే ఓ మహిళకు గుర్తు తెలియని వ్యక్తి నువ్వంటే నాకు ఇష్టమంటూ మెసేజ్ పెట్టాడు. మహిళ ఆ నంబరు బ్లాక్ చేసింది. అయితే, అతడు మహిళ ఫొటోలు అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి వాట్సాప్ చేశాడు. దీంతో బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇంట్లో చోరీ

ఇంట్లో చోరీపై పోలీసులు కేసు నమోదు చేశారు. విజయపురికాలనీ 5వ లైనులో నాగాంజనేయులు కుటుంబ సభ్యులతో కలసి బుధవారం ఇంట్లో నిద్రించారు. తెల్లవారుజామున లేచి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. రెండు బెడ్ రూముల్లో బీరువాలు తెరిచి ఉన్నాయి. వాటిల్లోని 200 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు కిటికిలో నుంచి తలుపులు తెరిచి లోపలకు ప్రవేశించినట్లు పోలీసులు నిర్ధారించారు.

కుల దూషణపై కేసు నమోదు

మహిళను కులం పేరుతో దూషించిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. బొంగరాలబీడుకు చెందిన చల్లా మీనా సరిపుడి సుజికి షోరూమ్‌లో సేల్స్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. కొద్ది రోజుల కిందట షోరూమ్‌లో ఉద్యోగి గౌతమ్ కష్టమర్ల నుంచి రూ. 2 లక్షలు వసూలు చేసి పరారయ్యాడు. ఈ నేపథ్యంలో మీనా పోలీసులకు ఫిర్యాదు చేయబోగా, కంపెనీ జీఎం సుమన్, సీఈఓ స్వర్ణ శ్రీనివాస్ తొలుత వద్దని వారించారు. అనంతరం ఇద్దరు మీనాపై అభియోగాలు మోపి ఇబ్బంది పెట్టారు. కులం పేరుతో దూషించారు. ఈ మేరకు మీనా గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గుంటూరును అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యం

మంత్రి విడదల రజిని



రోడ్డుకు శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి విడదల రజని, విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ కావటి

నెహ్రూనగర్: గుంటూరు నగరాన్ని మెట్రో నగరాలకు దీటుగా తీర్చిదిద్దడమే తమ ఏకైక లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలోని ఏటీ అగ్రహారం ప్రధాన రహదారిని నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో రూ.5.88 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేయనున్న పనులకు గురువారం ఆమె ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడుతో కలసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గుంటూరు అభివృద్ధిని గత పాలకులు పూర్తిగా విస్మరించారని విమర్శించారు. గత టీడీపీ ప్రభుత్వంలో యూజీడీ పేరుతో గుంతలమయంగా మార్చేశారని మండిపడ్డారు. రోడ్ల మీద ప్రయాణం చేయాలంటే నరకప్రాయంగా నగరవాసులు భావించాల్సిన పరిస్థితి నెలకొందని గుర్తు చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరును అన్ని విధాలుగా అభివృద్ధితో పాటు రోడ్ల విస్తరణ, సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

■ ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గుంటూరు నగర అభివృద్ధి వేగంగా సాగుతోందని చెప్పారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహించి గుంటూరు సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణతో నగరవాసుల కల నెరవేరుతుందన్నారు.

■ ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ నగరంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంతోపాటు చిన్నచిన్న సమస్యల్ని కూడా పరిష్కరిస్తూ అభివృద్ధి పథంలో తీసుకు వెళ్తున్నామని చెప్పారు.

■ నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఏటీ అగ్రహారం ప్రధాన రహదారి గత కొన్ని దశాబ్దాలుగా విస్తరణకు నోచుకోక పెండింగ్‌లో ఉందన్నారు. నేడు చుట్టుగుంట సెంటర్ వరకు 1.2 కిలోమీటర్ల పొడవు, 80 అడుగుల విస్తరణతో రూ. 5.88 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్నామని తెలియజేశారు. రోడ్డు విస్తరణ వల్ల నాలుగు డివిజన్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, నరసరావుపేట వైపు వెళ్లే వారికి షార్ట్ కట్‌గా, ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ప్రయాణం సాఫీగా చేయవచ్చని చెప్పారు. నగరంలో పలకలూరు రోడ్డు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డు, నందివెలుగు రోడ్డు, రామనామక్షేత్రం రోడ్డు వంటి ప్రధాన రహదార్లను విస్తరించి, సెంటర్ డివైడర్, సెంటర్ లైటింగ్, రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని మేయర్ తెలిపారు. ఇప్పటికే కొన్ని రహదార్ల పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఏటీ అగ్రహారం రోడ్డులో ఇప్పటికే సైడు కాలువలు నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు.

■ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ నగర పాలక సంస్థలో నూతన పాలక వర్గం ఏర్పడ్డాక అభివృద్ధి పనులు వేగవంతంగా చేస్తున్నామన్నారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాల్ని అమలు చేస్తున్నారన్నారు. నగరాభివృద్ధికి కూడా పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలియచేశారు. కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పీవీ నరసింహారావు విగ్రహావిష్కరణ



విగ్రహావిష్కణలో మంత్రి రజని, విప్ అప్పిరెడ్డి, ఎమ్మెల్యే గిరిధర్, మేయర్ కావటి

పట్నంబజారు: బ్రాడీపేట ప్రధాన రహదారిలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారతరత్న పీవీ నరసింహారావు విగ్రహాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, మేయర్ కావటి మనోహర్ నాయుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు (లాలుపురం రాము)తో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణులంతా సంఘటితంగా పీవీ విగ్రహాన్ని గుంటూరులో ఏర్పాటు చేసుకోవడం మంచి పరిణామమని ప్రశంసించారు.

దేశానికే వన్నె తెచ్చిన మహనీయుడు పీవీ

ప్రధానిగా, ముఖ్యమంత్రిగా పనిచేసి ఇటు రాష్ట్రానికి, అటు దేశానికే వన్నె తెచ్చిన మహనీయుడు పీవీ నరసింహారావు అని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కొనియాడారు. గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ పీవీ నిర్ణయాలు, ఆర్థిక సంస్కరణలే భారతావనికి దిక్సూచిగా మారాయని తెలిపారు. పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మాట్లాడుతూ పీవీ గొప్ప పరిపాలనా దక్షుడే కాక బహుభాషా పండితుడని కొనియాడారు. ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపు శ్రీకాంత్, విగ్రహ దాతలు తుళ్లూరు ప్రకాష్, సురేఖ దంపతులు, పరశురామ బ్రాహ్మణ సంఘం ప్రతినిధి ఆదిలక్ష్మి, బ్రాహ్మణ సేవా సమితి ప్రతినిధులు బాలకృష్ణ, పొత్తూరి శ్యామ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుందరరామశర్మ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, గీతామందిరం చైర్మన్ వెలుగూరి రత్నప్రసాద్, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ పోకల వెంకటేశ్వరరావు, అన్నదాన సత్రం చైర్మన్ పోకల వసంత్, క్లస్టర్ ట్రెజరర్ మహేంద్ర గులేచా, అన్నంరాజు సాయిరాం పాల్గొన్నారు.













మహిళలను గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి



జేకేసీ కళాశాలలో మహిళా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో నాగేశ్వరరావు, ఎస్సార్కే ప్రసాద్



హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఉద్యోగినులు, అధ్యాపకులకు సన్మానం



కేఎల్‌పీ స్కూల్లో మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేసిన రత్నగిరిబాబు



ఐసీఏఐ గుంటూరు శాఖ ప్రతినిధులతో డాక్టర్ నాగ శ్రీ హరిత



మాధవిని సత్కరిస్తున్న సంస్థ నిర్వాహకులు

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళల్ని గౌరవించినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని జేకేసీ కళాశాల పాలకవర్గ సభ్యుడు మాదల రత్నగిరిబాబు పేర్కొన్నారు. గురువారం జేకేసీ కళాశాలలో మహిళా సాధికారిత విభాగ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా స్వీపర్లు, అటెండర్లకు నూతన వస్త్రాలను బహుకరించారు. ఈసందర్భంగా రత్నగిరిబాబు మాట్లాడుతూ ప్రతి మహిళో అంతర్లీనంగా శక్తి దాగి ఉంటుందని, వారిని గౌరవించడం మన సంప్రదాయమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. నాగేశ్వరరావు, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్సార్కే ప్రసాద్, పి. గోపీచంద్, అధ్యాప, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

■ కుటుంబం, వృత్తి బాధ్యతల నిర్వహణలో మహిళలు సమర్థమైన పాత్ర పోషిస్తున్నట్లు హిందూ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం అమరావతి రోడ్డులోని కళాశాల మహిళా సాధికారిత విభాగ ఆధ్వర్యంలో మహిళా సిబ్బందితో పాటు మహిళా అధ్యాపకుల్ని సత్కరించారు. ప్రిన్సిపాల్ ఎస్వీ రమణ మాట్లాడుతూ దేశంలో మహిళల్ని గౌరవించడం అనేది అనాదిగా వస్తోందని తెలిపారు. మహిళా సాధికారిత విభాగ డైరెక్టర్ చల్లా వైష్ణవి మాట్లాడుతూ మహిళా సాధికారిత విభాగాన్ని ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా తరుణీ ఆరోగ్యం అనే అంశంపై ఉపన్యాసాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ కన్సల్టెంట్ డయాబెటాలజిస్ట్ డాక్టర్ కట్టా శోభ, ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ కె. లలిత, ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

■ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జన చైతన్య హౌసింగ్ ప్రైవేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విద్యాసంస్థల్లో పని చేస్తున్న 100 మందికి పైగా మహిళా సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి మాదల రత్నగిరిబాబు మాట్లాడుతూ జనచైతన్య హౌసింగ్ చైర్మన్, ఎండీ మాదల సుధాకర్, డైరెక్టర్ మాదల శకుంతల ఆదేశాల మేరకు మహిళలకు చీరల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

■ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వతనేని నాగ శ్రీహరిత పేర్కొన్నారు. శ్రీనివాసరావుతోటలోని ఐసీఏఐ గుంటూరు శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో శాఖ చైర్మన్ నూతలపాటి అమర్‌నాథ్, కార్యదర్శి రుద్రవరపు భరద్వాజ, వంగల భార్గవి, ముప్పాళ్ల సుబ్బారావు, చింతా వీఎస్ఎస్ రఘునందన్, వనిమిరెడ్డి వెంకట నరేష్, కన్నెగంటి మృత్యుంజయరావు, మద్ది రవితేజ పాల్గొన్నారు.

మహిళలు సామాజిక సేవలో ముందుండాలి

పాత గుంటూరు: మహిళలు సేవా రంగంలో ముందుండి కార్యక్రమాలు నిర్వహించాలని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధిపతి డాక్టర్ మాధవి సూచించారు. బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై ఆంధ్రప్రదేశ్ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మహిళా విభాగం, గుళ్లపల్లి సుబ్బారావు సేవాసంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, గుళ్లపల్లి రాఘవేంద్రరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభకు డాక్టర్ మాధవపెద్ది విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ మాధవి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలతో పాటు సేవా రంగంలో ముందున్నప్పుడే అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రయోజనం నెరవేరుతుందని తెలిపారు. సభలో ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకురాలు ఎస్. విజయలక్ష్మి, సాహితీవేత్త వి. నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి నాబార్డు కృషి

- ఏపీ రీజినల్ చీఫ్ జీఎం ఎం.ఆర్.గోపాల్
- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



జ్యోతి ప్రజ్వలనలో అతిథులు

నగరంపాలెం: మహిళల అభివృద్ధికి కృషి చేస్తూ నాబార్డు పలు పథకాల్ని ప్రవేశపెట్టిందని ఏపీ రీజినల్ కార్యాలయ చీఫ్ జీఎం ఎం.ఆర్.గోపాల్ తెలిపారు. నాబార్డు ఆధ్వర్యంలో గురువారం గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలనతో అతిథులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. చీఫ్ జీఎం గోపాల్ మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల బృందాల ద్వారా మహిళలు ఉన్నతంగా రాణించారని చెప్పారు. జిల్లా సంయుక్త కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం నాబార్డు అనేక కార్యక్రమాల్ని అమలు చేయడం సంతోషకరమన్నారు. మహిళలు తయారీ చేసిన ఉత్పత్తుల్ని విక్రయించేందుకు ప్రత్యేకంగా ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఆచార్య ఎన్జీరంగా విశ్వ విద్యాలయం ఉప కులపతి శారదా జయలక్ష్మీదేవి మాట్లాడుతూ మహిళలు లేని ఇంటిని ఊహించలేమన్నారు. ఇంటికి వారే ప్రథమ గురువులని పేర్కొన్నారు. అన్ని రంగాల్లోనూ మహిళలు అభివృద్ధి సాధిస్తున్నారని, ఇక ఆకాశమే హద్దుగా ఎదగాలని చెప్పారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డెప్యూటీ జీఎం సయ్యద్ జవహర్ మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాల బృందాల ద్వారా నారీ శక్తి పేరుతో తక్కువ వడ్డీకి రుణాలు మంజూరు చేస్తూ వారి ఎదుగుదలకు దోహదం చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఐదు రోజులపాటు కొనసాగనున్న ఎగ్జిబిషన్‌ను అతిథులు ప్రారంభించారు. అందులో ఏర్పాటు చేసిన 25 దుకాణాల్లో చీరలు, వస్త్రాలు, కొండపల్లి బొమ్మలు, పిండి వంటలు, చిరుధాన్యాల ఆహార పదార్థాలు, జ్యూట్ బ్యాగ్‌లు తదితర వాటిని నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. ఉమ్మడి జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏపీ నాబార్డు ప్రాంతీయ కార్యాలయానికి చెందిన 20 మంది మహిళా అధికారులు, జిల్లాలోని అధికారులు, డ్వాక్రా మహిళలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో నర్సింగ్ విద్యార్థుల మధ్య రగడ

- మేల్ విద్యార్థులు కొట్టారంటూ ఫిమేల్ విద్యార్థుల ఫిర్యాదు
- విచారణ చేసిన అధికారులు

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ నర్సింగ్ పాఠశాలలో విద్యార్థుల మధ్య రగడ జరిగింది. గురువారం మేల్ నర్సింగ్ విద్యార్థులు తమపై దాడి చేశారంటూ ఫిమేల్ నర్సింగ్ విద్యార్థులు ఫిర్యాదు చేశారు. నర్సింగ్ విద్యార్థుల మధ్య గొడవ జరుగుతోందని జీజీహెచ్ అవుట్ పోస్టు పోలీసులకు సైతం ఫిర్యాదు వెళ్లడంతో పోలీసులు, ఆసుపత్రి అధికారులు నర్సింగ్ స్కూల్ వద్దకు చేరుకున్నారు. ఇటీవల నర్సింగ్ స్కూల్‌లో జరిగిన ఓ వేడుక నిర్వహణకు డబ్బులు వసూలు చేసే విషయంలో విద్యార్థుల మధ్య గొడవకు కారణమైనట్లు అధికారులు తెలిపారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ స్కూల్‌కు వెళ్లి విద్యార్థుల మధ్య విచారణ చేశారు. నర్సింగ్ స్కూల్‌లో ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్ డే వేడుకలు ఇక నుంచి చేయడానికి వీల్లేదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపాల్‌కు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తే వారికి సీటు క్యాన్సిల్ చేసేందుకు వెనుకాడబోమని తెలిపారు.

స్వప్నకు డాక్టరేట్ ప్రదానం



ఏఎన్‌యూ: నాగార్జున యూనివర్సిటీ రసాయనశాస్త్ర పరిశోధకురాలు జి. స్వప్నకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిందని రీసెర్చ్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్మయి తెలిపారు. రసాయనశాస్త్ర పరిశోధన పర్యవేక్షకులు ఆచార్య బి. కేశవరావు పర్యవేక్షణలో 'ఐసోలేషన్, కేరక్టరైజేషన్ ఇన్ సిలికో యాంటీఫెర్టిలిటీ డాకింగ్ స్టడీస్, ఫార్మకోలాజికల్ ఏ వాల్యుయేషన్ ఆఫ్ నేచురల్ అండ్ సింథటిక్ క్రొమినో పైరోజోలోన్స్ ఫ్రమ్ కార్డియో డైకోటమా జి ఫ్రాస్ట్- బొరాగినేసి' అనే అంశంపై పరిశోధన గ్రంథం సమర్పించినందుకుగాను ప్రదానం చేసినట్లు ఆమె పేర్కొన్నారు.



డెప్యూటీ డీఈవో వసూళ్ల వ్యవహారంపై విచారణ

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు డీవైఈవో పి. వెంకటేశ్వరరావుపై వచ్చిన అవినీతి, ఆరోపణలపై పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి గురువారం విచారణ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల్ని తన కార్యాలయానికి పిలిపించుకుని గోప్యంగా విచారణ జరిపారు. పాఠశాలల తనిఖీలకు, సందర్శనలకు వెళ్లిన సమయంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వసూళ్లకు పాల్పడటంతో పాటు వివిధ రకాలుగా వేధింపులకు పాల్పడిన సంఘటనలపై హెచ్ఎంలు, పాఠశాలల యాజమాన్యాలు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. దీనిపై విచారణ జరిపిన ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి హెచ్ఎంలు చెప్పిన అంశాల వారీగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్లు చెప్పారు.

76 మందికి స్టాఫ్‌నర్సుల నియామక ఉత్తర్వులు

గుంటూరు మెడికల్ : గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయంలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించి 76 మంది కాంట్రాక్టు స్టాఫ్‌నర్సులకు నియామక ఉత్తర్వులు అందజేశారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేశారు.



